# డాలస్‌లో ఓసీఐ వర్క్‌షాప్‌కు విశేష స్పందన

23-08-2016 00:03:58



**డాలస్ (టెక్సాస్):** ఇండియన్ అమెరికన్ ఫ్రెండ్‌షిప్ కౌన్సిల్ (ఐఏఎఫ్‌సీ), ఇండియా అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ (ఐఎఎన్‌టి), డిఎఫ్‌డబ్ల్యు ఏరియా ఇండియన్ అమెరికన్ కమ్యూనిటీ సంస్థల తోడ్పాటుతో శనివారం టెక్సాస్‌లోని డాలస్ నగరంలో ఓవర్సీస్ సిటిజెన్స్ ఆఫ్ ఇండియా(ఓసీఐ) వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఓసీఐ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోదలచిన ఎన్నారైల ప్రయోజనార్థం కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా, హోస్టన్ కార్యాలయంతో కలిసి ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌కు అక్కడి ప్రవాస భారతీయులు విశేషరీతిలో స్పందించారు. డాలస్‌లోని సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ వేలో ఉన్న పార్క్‌ప్లాజా టవర్‌లో ఉదయం నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకూ ఈ కార్యక్రమం జరిగింది. అమెరికా పాస్‌పోర్టులు కలిగి ఉండి, ఓసీఐ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలనే భారత సంతతి వారికి ఈ వర్క్‌షాప్ ఎంతో ఉపయోగపడింది. ఓసీఐ దరఖాస్తులను నింపి.. అవసరమైన ధ్రువపత్రాలతో వచ్చిన సుమారు 150 మందికి పైగా ప్రవాసభారతీయులకు కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా, హ్యూస్టన్ అధికారులు ఆర్ డి జోషి, రాకేష్ శర్మ, చంద్రసేన్ సేవలందించారు. అంతకుముందు దరఖాస్తుదారులకు ఐఎఎఫ్‌సి, ఐఎఎన్‌టి సంస్థల కార్యకర్తలు అవగాహన కల్పించారు.

## ఓసీఐ వర్క్‌షాప్ ఫోటో గ్యాలరీ...

సాధారణంగా కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా (సిజిఐ) పనితీరుపై ఎన్నో ఫిర్యాదులు వస్తుంటాయని, అయితే ఈ వర్క్‌షాప్‌లో అందుకు భిన్నంగా సిజిఐ అధికారుల సేవలను ప్రతి ఒక్కరూ ప్రశంసించారని ఐఎఫ్‌సి అధ్యక్షుడు ప్రసాద్ తోటకూర తెలిపారు. ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించిన ఐఎఫ్‌సి చేసిన ఏర్పాట్లు, వలంటీర్ల సేవలను అందరినీ ఆకట్టుకున్నాయన్నారు. ప్రత్యేకించి ఎన్నారైలకు తోడ్పాటునందించేందుకు ముందుకు వచ్చిన భారత కాన్సులేట్ జనరల్ డాక్టర్ అనుపమ్ రేకు ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

సిజిఐ అధికారులు ప్రతి ఓసీఐ దరఖాస్తుదారుతోనూ కనీసం 10 నుంచి 15 నిమిషాల పాటు ఓపికగా మాట్లాడి, వారి పత్రాలను సరిచూసి ఆమోదముద్ర వేశారని ఈ వర్క్‌షాప్‌కు సమన్వయ కర్తగా వ్యవహరించిన ఐఎఫ్‌సి ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ తయ్యబ్ కుందవాలా తెలిపారు. వర్క్‌షాప్ కోసం సహకరించిన పార్క్ ప్లాజా టవర్ యజమానులకు ధన్యవాదాలు చెప్పారు.

ఐఎఫ్‌సి ఉపాధ్యక్షుడు కాల్వల రావు, కార్యదర్శి జాన్ హేమండ్, ఐఎన్‌టి అధ్యక్షురాలు ఇందు మందాడి, కార్యదర్శి బి నరసింహ, ఈ సంస్థ పాలకమండలి సభ్యుడు శైలేష్ షా తదితరులు ఈ వర్క్‌షాప్ నిర్వహణలో కీలకపాత్ర పోషించారు.